క్లుప్తంగా

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కోవెలకుంట్ల: పట్టణంలోని సీవీ రామన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం శక్తిటీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్, వాట్సాప్ కాల్ ద్వారా వ్యక్తిగత బ్యాంకు ఖాతా, ఆధార్, ఓటీపీ, తదితర వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నారు. విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండి జూనియర్లతో సోదరభావంతో మెలగాలని సూచించారు. శక్తిటీం ఏఎస్ఐ నాగరాజు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలి మృతి


లక్ష్మీనారాయణమ్మ (ఫైల్)

బనగానపల్లె: మండలంలోని చెరువుపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు ఇటిక్యాల లక్ష్మీనారాయణమ్మ (62) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి భర్త చిన్న పుల్లయ్య వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆమెకు ఓ కుమార్తె ఉన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి ఆమె నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు.

యాగంటి ఆలయానికి రూ.17 లక్షల ఆదాయం

బనగానపల్లె: మండలంలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.17 లక్షల ఆదాయం లభించింది. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన వేలంలో పాతపాడు గ్రామానికి చెందిన మల్లికార్జున రెడ్డి ఐస్‌క్రీమ్ అమ్ముకునే హక్కును రూ.6.25 లక్షలతో దక్కించుకున్నారు. రుద్రాక్ష మాలలు, పూసల మాలలు, రాగి కడియాలు, కరుంగళి మాలలు విక్రయించేందుకు ఎస్.వెంకటేశ్వర్లు రూ.10.35 లక్షలతో హక్కును పొందారు. పర్యవేక్షకులు బీవీ నర్సయ్య, బండి మాళేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని విజయ డెయిరీ సిబ్బందిపై ఈ నెల 13వ తేదీ రాత్రి దాడికి పాల్పడిన ఆర్ఎంపీ డాక్టర్ బాలు, ఇందిరానగర్‌కు చెందిన విజయ పాల ఆటో డ్రైవర్ నరేష్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. డెయిరీ పక్కన ఉన్న మంజీర బార్‌లో నిందితులు మందు తీసుకుని డెయిరీలోకి వెళ్లి మేనేజర్ చైర్‌లో కూర్చొని మద్యం సేవిస్తుండగా వారించిన సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకాలు

డోన్ టౌన్: పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి నివారణ కోసం ఉచిత టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ సబ్ డివిజన్ పశువైద్య శాఖ ఉప సంచాలకుడు నాగరాజు అన్నారు. స్థానిక ఆస్పత్రిలో మంగళవారం టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు టీకా కార్యాక్రమం జరుగుతుందన్నారు.

- సర్పంచులందరూ వైఎస్సార్‌సీపీ మద్దతుదార్లే
- వారి అధికారాలను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం
- సర్పంచులకు తెలియకుండానే పనులు
- పంచాయతీరాజ్ వ్యవస్థకు తూట్లు

సర్పంచ్‌లు... ఉత్సవ విగ్రహాలు!


జక్కసానికుంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్యాపిలి: సర్పంచ్ అంటే గ్రామ ప్రథమ పౌరుడు. పంచాయతీ రాజ్ వ్యవస్థను దిశానిర్దేశం చేసేది కూడా గ్రామ సర్పంచే. ఎన్నికల ముందు గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమంటూ భూటకపు హామీలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే తమ నిజస్వరూపం చూపిస్తున్నారు. గ్రామ పంచాయతీల సర్పంచులందరూ వైఎస్సార్‌సీపీ మద్దతుదార్లే కావడంతో కూటమి ప్రభుత్వం ఏకంగా సర్పంచుల హక్కులను, అధికారాలనే కాలరాస్తోంది. ప్యాపిలి మండలంలో 31, డోన్‌లో 26, బేతంచెర్లలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేశారు. గ్రామ పంచాయతీలతో పాటు అదనంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ పాలన మరింత చేరువ చేశారు. అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించారు. దీంతో ప్రతి పంచాయతీ పట్టణ శోభను సంతరించుకుంది.

సర్పంచ్‌ల అధికారాలకు ఎసరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సర్పంచుల పవర్‌కు ఎసరు పెట్టింది. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చడంతో తమ పంచాయతీలో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో సర్పంచ్‌లు ఉన్నారు. వెండర్‌కోడ్ పేరుతో పనులను ఇతరులతో చేయిస్తూ సర్పంచులను అవమానిస్తోంది. చివరకు ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో కూటమి నేతలు అనధికార వ్యక్తులకు అప్పగించేశారు. మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు సైతం సర్పంచుల మాటను పెడచెవిన పెడుతున్నారు. కూటమి నేతల మాటలకే విలువిస్తున్నారు.

పేరుకే పల్లె పండుగ

పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో జరుగుతున్న పనులు పేరుకే పల్లె పండుగ అన్న చందంగా మారాయి. సర్పంచుల ఆమోదం, తీర్మానం కూడా లేకుండా టెండర్ కోడ్‌తోనే కాంట్రాక్టర్లు పనులు చేపడుతున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు సర్పంచుల ఖాతాలకు కాకుండా వెండర్ల ఖాతాల్లో జమ అవుతున్నట్లు సమాచారం. తమ అధికారాలను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సర్పంచులకు ఇవ్వాల్సిన కనీస మర్యాద ఇవ్వడంతో పాటు వారి హక్కులను కాపాడాల్సిన అవసరం ఉంది.

డోన్ నియోజకవర్గంలో ఉన్న సర్పంచ్‌లు

మండలం	సర్పంచ్‌లు
డోన్	26
ప్యాపిలి	31
బేతంచెర్ల	19


రామకృష్ణాపురంలో వైఎస్సార్‌సీపీ హయాంలో వేసిన సీసీరోడ్డు

మాకు తెలియకుండానే పనులు



ఏనుగుమర్రిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు ప్రాంతాల్లో సీసీ రోడ్డు వేశారు. పంచాయతీ పరిధిలో ఏ చిన్న పని చేపట్టినా గ్రామ సర్పంచ్ తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే మా ప్రమేయం లేకుండానే పనులు చేపట్టారు. సర్పంచుల విషయంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తోంది. గ్రామ ప్రథమ పౌరుడిగా సర్పంచుకు ఉన్న ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించాలి. –కరణం మదన్‌మోహన్ రాయల్, సర్పంచ్, ఏనుగుమర్రి

సమావేశాలకు వెళ్లడం మానేశాం



అధికారులు సర్పంచులకు ఏమాత్రం విలువ ఇవ్వడం లేదు. మాకు తెలియకుండానే సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. నామమాత్రంగా సమావేశాలకు ఆహ్వానిస్తున్నారు. దీంతో సమావేశాలకు వెళ్లడం మానుకున్నాం. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ. 60 లక్షలతో అభివృద్ధి పనులు చేశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా గ్రామంలో అభివృద్ధి పనులు మచ్చుకైనా చేపట్టలేదు. వీధిలైట్లు అమర్చడానికి కూడా పంచాయతీల వద్ద నిధులు లేవు. –రావూరి పద్మావతి, సర్పంచ్, రామకృష్ణాపురం

నైపుణ్యం పెంచుకుంటేనే అవకాశాలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: యువత వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో 15వ ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు నైపుణ్యాల ప్రదర్శన, స్వీయ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో రాణించాలంటే నైపుణ్యం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ శశాంక, రామసుబ్బారెడ్డి, కృష్ణదాసు, అన్నపూర్ణ, నాగేశ్వరరెడ్డి, లక్ష్మిదేవి, చంటిరెడ్డి, సుభాష్‌రెడ్డి, నరేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

బేతంచెర్ల: విద్యార్థులు చదువుతోపాటు భవిష్యత్తులో స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సావిత్రమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ యువత నైపుణ్యం దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

బహుమతుల ప్రదానం

డోన్ టౌన్: స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మై ట్రేడ్ మై డ్రీమ్ పేరుతో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, కేస్ స్టడీస్, క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, మహేష్ పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలు సాధించాలి

అవుకు: పోటీ ప్రపంచంలో యువత ఏదో ఒక రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ హెమీమా అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. నరేంద్ర, హుస్సేన్‌వలి పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ


బీఎల్‌ఓలకు ప్రశంసా పత్రాలు అంజేస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బూత్‌లెవల్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు కొత్తగా ఓటు హక్కు నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, అభ్యంతరాలపై బీఎల్‌ఓలకు తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచనలు అందజేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో కొత్తగా ఓటు హక్కుకోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించాలన్నారు. అక్టోబర్ నెలలో ఓటర్ల జాబితా పబ్లికేషన్, వచ్చే ఏడాది జనవరిలో నెలలో తుది జాబితా ప్రకటన ఉంటుందని తెలిపారు. అనంతరం బీఎల్‌ఓలకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన బీఎల్‌ఓలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శివారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మంజుల, ఆర్ఐ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం

బేతంచెర్ల: మండలంలోని ఆర్ కొత్తపల్లె, ఆర్ బుక్కాపురం, అంబాపురం గ్రామాల్లో మంగళవారం పర్యటించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డిని గ్రామస్తులు సమస్యలతో స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీ కాల్వలు లేకపోవడంతో మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తోందని గ్రామస్తులు విన్నవించారు. కొన్నికాలనీల్లో తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని, కొళాయిలు ఏర్పాటు చేయాలంటూ ఎమ్మెల్యేను కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.


ఆర్ కొత్తపల్లెలో మురుగునీటి సమస్యపై విన్నవిస్తున్న గ్రామస్తులు

నేటి నుంచి పీ4 గ్రామ సభలు

సంజామల: మండలంలో బుధవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు పీ4 గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో సభలు జరుగుతాయన్నారు. ఈ నెల 16న ముక్కమల్ల, ఆకుమల్ల, 17న ఆల్వకొండ, పేరుసోముల, 18న కమలపురి, ముదిగేడు, 19న సంజామల, కానాల 22న గిద్దలూరు, లింగందిన్నె, 24న నొస్సంలో గ్రామసభలు ఉంటాయని వెల్లడించారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రకార నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆలయ ఈఓ రామాంజనేయులు, కంట్రాక్టర్‌కు సూచించారు. దేవస్థానంలో తాగునీటి కొరతను అధిగమించడానికి గోరుకల్లు రిజర్వాయర్ నీటిని అందించాలని అధికారులు ఎమ్మెల్యేను కోరారు. చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

చౌడేశ్వరి ఆలయానికి విరాళం


విరాళం అందిస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి నిజామాబాద్‌కు చెందిన హనుమంతురావు, సీతామహాలక్ష్మి దంపతులు మంగళవారం రూ.25వేల విరాళం ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ వేదపండితులకు నగదు అందజేశారు. దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

శాకాంబరి అలంకరణలో రేణుకా ఎల్లమ్మ



ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో వెలసిన రేణుకా ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామస్తులు మొక్కుకున్నారు.

టీడీపీ నేతల మధ్య ప్లాస్టిక్ వార్!


ప్లాస్టిక్ వ్యర్థాలను ఆటోలో తీసుకొచ్చి కోవెలకుంట్ల జుర్రేరు వాగు సమీపంలో పడేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మినరల్ వాటర్ ప్లాంట్ వ్యర్థాల కాలుష్యంపై ఇద్దరు టీడీపీ నేతల మధ్య మంగళవారం తీవ్రస్థాయి వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని వెలగటూరు టీడీపీ నేతకు చెందిన మినరల్ వాటర్‌ప్లాంట్ ప్లాస్టిక్ వ్యర్థాలను కోవెలకుంట్ల పట్టణ శివారులోని జుర్రేరు వాగు సమీపంలో పడేసి నిప్పంటించారు. వ్యర్థాలను కాల్చివేయడాన్ని పట్టణానికి చెందిన టీడీపీ నేత ఖండించారు. వ్యర్థాలను ఆ గ్రామ సమీపంలో పడేసి నిప్పు అంటించాలని, ఆ గ్రామం నుంచి తీసుకొచ్చి కోవెలకుంట్ల పట్టణ శివారులో పడేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేమిటని మండిపడ్డారు. అంతే కాకుండా ఈ వ్యవహారాన్ని వీడియో ద్వారా చిత్రీకరించి గ్రూపులో పోస్టు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని వెలగటూరు టీడీపీ నేత కోవెలకుంట్లకు చెందిన టీడీపీ నేతపై ఫోన్‌లో తీవ్రస్థాయిలో ఫైర్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఘటన టీడీపీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

ఆర్టీసీ ఎన్ఎంయూ కార్మికుల నిరసన


డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

బనగానపల్లె: డిపో మేనేజర్ ఏకపక్ష ధోరణికి నిరసనగా మంగళవారం బనగానపల్లె ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు ఎర్ర బ్యాడ్జిలతో ఆందోళన చేపట్టారు. యూనియన్ డిపో కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి భద్రావతి మాట్లాడుతూ.. డిపో మేనేజర్ రవికిశోర్ తనకు నచ్చిన ఏడీసీని మాత్రమే సఫలింగ్ చేయడం అక్రమమని మండిపడ్డారు. ఈ చర్యను వెంటనే రద్దు చేయాలని, మెకానిక్‌లకు, స్టోర్‌లో అసిస్టెంట్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే బస్టాండ్‌లో రెగ్యులర్ కంట్రోలర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికులు, విద్యార్థులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. హోలగుంద, శ్రీశైలం షెడ్యూల్ సర్వీసులకు నిర్దిష్టంగా రన్నింగ్ టైమ్ ఇవ్వాలన్నారు. గ్యారేజ్ కార్మికులకు ఆధునిక పరికరాలు కల్పించాలని కోరారు. చేయని తప్పులకు చార్జ్‌షీట్లు ఇవ్వడం, డీఎం దురుసు ప్రవర్తన మానుకోవాలని కోరారు. కార్మిక నాయకులు ఎస్ఎస్ వలి, దేవేందర్ రెడ్డి, వేములయ్య, జమ్ములయ్య, గఫార్, ఎల్లయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన



బేతంచెర్లలో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

బేతంచెర్ల: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


పాతబుగ్గ ఆలయ ప్రవేశ ద్వారం వద్ద తీర్చిదిద్దుతున్న దేవతామూర్తుల బొమ్మలు

భళా.. శిల్పకళ

డోన్: పట్టణంలోని పాతబుగ్గ దేవస్థానాన్ని శిల్పకళా నైపుణ్యంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు బైసాని రాజు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ఆర్టిస్ట్ హరి రూపకల్పనలో దేవస్థానం ముఖద్వార గోడలపై వివిధ దేవతామూర్తుల శిల్పాలు అద్భుతంగా మెరిసిపోతున్నాయి. వృషభంపై ఆదిదేవుడు, నెమలిపై సుబ్రమణ్యస్వామి, గణపతి బొమ్మల ఆకృతులు స్థానికులను.. భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానికులు ఈ కళాత్మక ఆలయ శోభను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల కరస్పాండెంట్‌కు సన్మానం


బుగ్గన నాగభూషణంరెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డిని 1998–99 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. రావు బహదూర్ బీపీ శేషారెడ్డి బేతంచెర్లకు విద్య, వైద్య రంగాల్లో చేసిన సేవలు అమూల్యమన్నారు. పూర్వ విద్యార్థులు ఫయాజ్, నరసింహ, భాస్కర్, మద్దిలేటి, అమర్, హరి పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు


మాట్లాడుతున్న డోన్ ఏడీఏ సునీత

బేతంచెర్ల: పంటల సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడొద్దని డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ సునీత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు ఏ విధంగా సాధించాలనే విషయంపై వివరించారు. ఏఓ విజయకుమార్ రెడ్డి, ఏఈఓ మహ్మద్, వీఏఏలు యశోద, భారతిభాయి, రవితేజ పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

కొలిమిగుండ్ల: అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు మెళకువలు పాటించాలని ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. మంగళవారం పెద్దవెంతుర్లలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. మొక్క జొన్న పంటకు మూడు దఫాలుగా నత్రజని ఎరువులు వేసుకోవాలని తెలిపారు. కౌలు పత్రాలు తీసుకోవడం వల్ల లాభాలు ఉన్నాయని పేర్కొన్నారు. పంట రుణాలు, నష్ట పరిహారం, పంట బీమా, మద్దతు ధర కౌలు రైతులకు చెల్లుతాయన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు ఫ్యూచర్ జనరల్ కంపెనీకి బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఆకాల వర్షాలు, కరువు, తదితర రూపాల్లో పంట నష్టం జరిగితే బీమా కంపెనీ నుంచి ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. మొక్క జొన్న పంటకు ఎకరాకు రైతు వాటా కింద రూ.660, ఆముదంకు రూ.160, ఉల్లికి రూ.450, మినుము రూ.190 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.